## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి

**మునగపాక:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మునగపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### వరికి తెగుళ్ల బెడద



అరబుపాలెంలో వరిపైరుకు సోకిన ఆకుముడత తెగులు

**మునగపాక:** వరి పైరుకు పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. మంగళవారం పొలాల క్షేత్ర పర్యటనలో భాగంగా వరికి ఆకుముడత, పాము పొడ తెగుళ్లు ఆశించినట్లు అరబుపాలెం వీఏఏ సత్య రవిరాజ్ గుర్తించారు. తెగుళ్ల నివారణకు పొలంలో నీరు బయటకు పోయేలా చూడాలని, అలాగే పొలంలో ముళ్ల కంప లాగాలన్నారు. పొలం గట్ల మీద గడ్డి కోసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎకరాకు 14 ట్యాంకుల నీటిలో 500 ఎంఎల్ మోనోక్రొటోఫాస్, మరో 500 ఎంఎల్ హెక్సాకొనజాల్‌ను కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ఈ సీజన్‌లో తెగుళ్లు సోకుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### మానసిక ఆరోగ్యం ప్రధానం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

**ఎస్.రాయవరం:** శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా ప్రధానమని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక మాసోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ పీహెచ్‌సీ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

### హర్యానాలో విజయంపై బీజేపీ సంబరాలు

**మునగపాక:** హర్యానాలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం రాత్రి తోటాడలో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. స్వీట్లు పంచుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి నాగేశ్వరరావు, పార్టీ నేతలు వుడా రమేష్, చదరం సూరప్పారావు, నాగభూషణం, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

### పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి



సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలతో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

**గొలుగొండ :** బడుగు బలహీన వర్గాల ప్రజలు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని జిల్లా సీపీఎం కార్యదర్శి లోకనాథం కోరారు. ఏఎల్‌పురంలో దివంగత సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పేదలకు న్యాయం జరగలేదని, ఎన్నో ఏళ్లుగా బంజరు భూములు సాగు చేస్తున్న పేదలకు పట్టాలు మంజూరు చేయలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం పనిచేయాలన్నారు.



# సరుగుడు తోట.. లాభాల బాట




- నష్టాలు రావడంతో చెరకు సాగుపై రైతుల అనాసక్తి
- ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు
- పాయకరావుపేట నియోజకవర్గంలో 10 వేల హెక్టార్లలో సరుగుడు సాగు

**ఆరుగాలం శ్రమించి నలుగురికి తిండి గింజలు అందించే అన్నదాత తాను నిలదొక్కుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ప్రత్యామ్నాయ** మార్గాలను వెతుక్కోవాల్సి వస్తోంది. సంప్రదాయ పంటలను విడిచి ఆదాయాన్ని ఇచ్చే పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో చెరకుకు సరుగుడు సాగు ప్రత్యామ్నాయంగా మారడమే ఇందుకు నిదర్శనం.

**కోటవురట్ల:** పాయకరావుపేట నియోజకవర్గంలో పదేళ్ల క్రితం పరిస్థితులకు ఇప్పటికీ చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు చెరకు సాగు ఆర్థికంగా ఆసరా ఇవ్వగా, రానురాను నష్టాల్లోకి చేరడంతో చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయి. తద్వారా రైతులు చెరకు సాగుకు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో చెరకు



బాజు(18 అడుగులు) కర్రలు

స్థానాన్ని సరుగుడు సాగు భర్తీ చేస్తోంది. నియోజకవర్గంలో సుమారు 10 వేల హెక్టార్లలో సరుగుడు సాగవుతుండగా కోటవురట్ల మండలంలో అత్యధికంగా సుమారు 3 వేల హెక్టార్లలో సాగులో ఉంది.

**ఖర్చు తక్కువ.. లాభాలు ఎక్కువ**

**సరుగుడు సాగుతో తక్కువ ఖర్చు**తోనే అధిక **లాభాలు సమకూరుతున్నాయి.** మొక్క నాటాక మూడు నుంచి నాలుగేళ్లలో పంట ఫలసాయం వస్తోంది. పెద్దగా శ్రమ లేకుండానే లాభాలు సొంతమవుతున్నాయి. నారు నాటాక నీటి తడులు, ఎరువుల అవసరం పెద్దగా ఉండదు. కూలీల అవసరం అంతకన్నా ఉండదు. ఏడాదికి ఒకసారి నిటారుగా ఎదిగేలా కొమ్మలు నరికితే చాలు. పెట్టుబడిగా ఎకరా పరిధిలో మొక్క నాటడం నుంచి కోత వరకు సుమారు రూ.50 వేలు ఖర్చు కాగా.. మూడేళ్లలో రూ.3,60,000 ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోను సుమారు రూ.3 లక్షల వరకు మిగులుతోంది. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం బాజు(18 అడుగులు) కర్ర టన్ను రూ.9 వేలు పలుకుతోంది. మీటరు ముక్క టన్ను రూ.7 వేలు ఉంది. ఎకరా పరిధిలో తోట బాగుంటే సుమారు 40 టన్నులు దిగుబడి వస్తుంది. ఇక్కడి నుంచి హైదరాబాద్,



ఎగుమతికి సిద్ధంగా ఉన్న సరుగుడు లోడు లారీ

రాజమండ్రి ప్రాంతాలకు ఎగుమతి అవుతుండగా, పలువురు చిన్న రైతులు వ్యాపారులుగా ఎదుగుతున్నారు. రైతుల వద్ద సరుగుడు తోటలను ఎకరా లెక్కన భేరం ఆడి కొనుగోలు చేస్తారు. కళాసీలను పెట్టుకుని తోటను నరికించి ఎగుమతి చేస్తారు. 25 మంది కలాసీలు ఒక్కరోజులో 15 టన్నుల కర్రను నరికి లారీలకు లోడింగ్ చేస్తారు. ఈ విధంగా కలాసీలకు టన్నుకు రూ.800 వస్తుంది. ఒక్కొక్క కలాసీకి రోజుకు రూ.700 వరకు కూలి గిట్టుబాటు అవుతుంది.

### ధర బాగుంది..



ప్రస్తుతం సరుగుడు కర్రకు డిమాండ్ ఉంది. ధర బాగుండడంతో రైతులకు లాభాలు వస్తున్నాయి. రైతుల నుంచి తోటను కొనుగోలు చేశాక నరుకుడు నుంచి లారీ లోడింగ్ వరకు మాదే బాధ్యత. రైతుకు ఇతర ఖర్చులతో సంబంధం ఉండదు. ధర బాగుండడంతో చాలా మంది రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. **– రాచపతి అప్పారావు**, వ్యాపారి, గొట్టివాడ

### మాకు పని దొరుకుతోంది..



సరుగుడు పుణ్యమా అని మాకు ఏడాది పొడవునా పని దొరుకుతోంది. వేరే పని వెతుక్కోవలసిన అవసరం లేదు. తోటను నరికి బాజు, మీటరు ముక్కలను నరికి లోడింగ్ చేసేందుకు టన్నుకు రూ.800 ఇస్తారు. తోటలు ఎక్కువగా ఉండడంతో మాకు నిరంతరాయం పని దొరుకుతోంది. ఉపాధి కోసం జిల్లాలు దాటాల్సిన పనిలేదు. **– బత్తిన ఈశ్వరరావు**, కలాసీ, గొట్టివాడ

### మంచి లాభాలు వస్తున్నాయి..



సరుగుడు తోటలతో మంచి లాభాలు వస్తున్నాయి. గతంలో చెరకు సాగు చేసేవాళ్లం. మొదట్లో లాభాలు వచ్చేవి. క్రమేపీ ధర గిట్టుబాటు కాక నష్టాలు రావడం మొదలైంది. దాంతో దాని స్థానంలో సరుగుడు తోట పెంచుతున్నాం. దీనికి మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం ధర కూడా బాగుంది. టన్ను ధర రూ.9 వేలు ఉంది. ఇది రైతుకు లాభసాటి పంట. **– రామునాయుడు**, రైతు, చౌడువాడ

### డంపింగ్ యార్డు కాదు.. శ్మశానవాటికే



తిమ్మరాజుపేట శ్మశానవాటిక ముందు చెత్త

**మునగపాక:** మండలంలోని తిమ్మరాజుపేటలో పారిశుధ్యం పడకేసింది. పంచాయతీకి చెందిన చెత్తను శ్మశానవాటిక ఎదుట కుప్పలుగా పడేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల వ్యయంతో శ్మశాన వాటికను అందంగా తీర్చిదిద్దారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సుందరంగా దర్శనమిచ్చే శ్మశానవాటిక పేరుకుపోయిన చెత్తతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చెత్తను శ్మశానవాటిక ముందు వేయకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**యలమంచిలి రూరల్:** యలమంచిలి పట్టణంలో కొత్తపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం సమీపంలో ఉన్న ఎస్ఎస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు తరలించనున్నారు. ఈ మేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని మిలట్రీ కాలనీ, కొత్తపేట, గుంటూరువారి వీధి, యాతపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## మార్మోగిన దుర్గమ్మ నామస్మరణ



మునగపాకలో దుర్గాదేవి అంబలం పూజలో పాల్గొన్న భక్తులు

**మునగపాక:** శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగపాక నందీశ్వర కళా ప్రాంగణంలో సోమవారం రాత్రి నిర్వహించిన దుర్గాదేవి అంబలం పూజ ఘనంగా జరిగింది. జై దుర్గ నామ స్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు.

**వేమగిరిలో బోనాల సందడి**

**ఎస్.రాయవరం:** మండలంలో వేమగిరి గ్రామంలో భవాని మాలధారణ భక్తులు మంగళవారం సాయంత్రం బోనాలు ఊరేగింపు నిర్వహించారు.



వేమగిరిలో బోనాల ఊరేగింపు

సుమారు 100 మందికి పైగా భక్తులు అమ్మవారి బోనాలను తయారు చేసి గ్రామం అంతటా ఊరేగించారు. అమ్మ శరణ ఘోషతో గ్రామం అంతటా ఆధ్యాత్మికత సంతరించుకుంది.

## దసరా పరమార్థాన్ని తెలుసుకోవాలి

**కోటవురట్ల:** దసరా పండగ పరమార్థాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు బి.శాంతరాజు కోరారు. తంగేడు, అన్నవరం గ్రామాల్లో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. బ్రహ్మ విద్య ప్రకారం దసరా అంటే పది ఇంద్రియాలను జయించడమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి కమిటీ ఉపాధ్యక్షుడు దవులూరి సత్యనారాయణ, సభ్యులు పీఎస్ఎన్ మూర్తి, సోమునాయుడు, నాగే



తంగేడులో త్రైత సిద్ధాంత భగవద్గీత కరపత్రాలతో స్థానికులు

శ్వరరావు, సత్యనారాయణ, బి.సత్యవతి, శోభారాణి, కె.శాంతి, దేవి, చిన్నారి పాల్గొన్నారు.

## కొండకర్లలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ

**అచ్యుతాపురం(మునగపాక):** అచ్యుతాపురం మండలం కొండకర్లలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి ఆధ్వర్యంలో కొండకర్ల ఆవ వద్ద సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రిటైర్డ్ డీఎఫ్‌వో జానకీరామ్ కోరారు. కొండకర్ల ఆవను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమితి కార్యదర్శి కర్రి జోగినాయుడు మాట్లాడుతూ ఆవ ప్రాంతం శుభ్రంగా ఉండేలా




కొండకర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చూడాలన్నారు. సర్పంచ్ ఏడిది లక్ష్మి, మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు రమణ అప్పారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 22 మద్యం షాపులకు 160 దరఖాస్తులు

**చోడవరం రూరల్ :** ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, చోడవరం స్టేషన్ పరిధిలోని 22 మద్యం దుకాణాల నిర్వహణకు లైసెన్సు పొందడానికి మంగళవారం నాటికి 160 దరఖాస్తులు అందాయని స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.వి.పాపునాయుడు తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం మాత్రమే అవకాశం ఉందని, ఆసక్తి గల వారు అన్ని నిబంధనలు పాటించి సాయంత్రం లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులను అందచేయాలని కోరారు. ఇప్పటి వరకు మండలాల వారీ అందిన ధరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలంలోని 8 షాపులకు తక్కువగా 38 దరఖాస్తులు అందగా, బుచ్చియ్యపేట మండలంలోని 5 షాపులకు అత్యధికంగా 51 దరఖాస్తులు, కె.కోటపాడు మండలంలోని 5 షాపులకు 40 దరఖాస్తులు దేవరాపల్లి మండలంలోని 4 షాపులకు 29 దరఖాస్తులు అందినట్టు సీఐ నాయుడు తెలిపారు. మద్యం దుకాణం లైసెన్సు కోసం దరఖాస్తు చేయదలచుకున్న ఆశావహులు ఏదైనా షెడ్యూల్డ్ బ్యాంకులో లైసెన్సింగ్ అథారిటీ , అనకాపల్లి పేరున రూ.2 లక్షలకు డీడీ తీసి, వారి గుర్తింపు ధ్రువపత్రంతో నేరుగా చోడవరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## పెసా చట్టంతోనే గిరిజన పల్లెల ప్రగతి

**నర్సీపట్నం :** షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పెసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పెసా కమిటీ సభ్యుడు బత్తుల కృష్ణ డిమాండ్ చేశారు. సమత, గిరిమిత్ర సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీహోమ్‌లో మంగళవారం పెసా చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, ఏపీ ఆదివాసీ హక్కుల సంఘం అధ్యక్షులు కళ్యాణ్ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాలు, గ్రామ సభల అమలుపై పెసా చట్టాలను నేటి గిరిజన యువత పూర్తిగా అవగాహన చేసుకోవడం ద్వారా దోపిడీ నుంచి గిరిజనులను కాపాడుకోవచ్చన్నారు. సమత సభ్యుడు లోతా సుబ్బారావు, బీఎస్పీ నాయకుడు బి.నాగరాజు, ప్రగతి సిరి కార్యదర్శి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## వరి సాగులో మెలకువలు అవసరం



పెదరాంభద్రపురంలో 'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు



దిమిలిలో ఎరువుల మిశ్రమం కలపడంపై సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు



రుక్మిణీపురంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

**పాయకరావుపేట:** వరి పండించే విధానం, సాగుపై రైతులు మెలకువలు తెలుసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సస్యరక్షణ, ఎరువులు వినియోగం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, బీజామృతంపై అవగాహన కల్పించి, తయారు చేసి చూపించారు. ఎరువులు యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి వివరించారు. వరి పంటకు ఎకరానికి 25 కేజీల పొటాష్ వేయాలని వివరించారు. అనంతరం వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ఇరిగేషన్ ఏఈ శ్రీరామమూర్తి, తాండవ వాలీ రైతు ఉత్పత్తి దారులు సంఘం సీఈవో జి.వి.వి.సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**దిమిలి, పంచదార్ల గ్రామాల్లో..**

**రాంబిల్లి (యలమంచిలి):** రాంబిల్లి మండలం దిమిలి, పంచదార్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు చీడ పీడల నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై మండల వ్యవసాయాధికారి సి.హెచ్.సుమంత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దిమిలి గ్రామ ఉప సర్పంచ్ మురళీకృష్ణ, పలువురు గ్రామ నాయకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

**పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో..**

**యలమంచిలి రూరల్:** వరి పంట సాగులో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని యలమంచిలి ఏడీఏ బి.ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు రైతులకు సూచించారు. మండలంలోని పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన వివిధ రకాల పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఆకుముడత, పొడ తెగులు నివారణకు క్లోరిఫైరిఫోస్ 2 మిల్లీ లీటర్లు హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లకు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరానికి 200 మిల్లీ లీటర్ల ద్రావణం పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు లలిత, మార్కెట్ కమిటీ పీఏస్ లక్ష్మణ్, అభ్యుదయ రైతులు వెంకటరామయ్య, రామ నరసింగరావు, నాయుడు పాల్గొన్నారు.



వాకపాడులో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

**ఎస్.రాయవరం:** పొట్ట దశలో ఉన్న వరి పంటకు ఎకరాకు 20 కేజీల పొటాష్ ఎరువును వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య చెప్పారు. వాకపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెగుళ్ల నివారణ, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎం.శిరీష, సచివాలయ వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఒంపోలులో..**



ఒంపోలులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి

**మునగపాక:** వరి సాగులో జాగ్రత్తలు పాటించాలని మునగపాక మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి కోరారు. మండలంలోని ఒంపోలులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో తెగుళ్లు సోకకుండా చూడాలన్నారు. ఎరువుల యాజమాన్యంపై దృష్టి సారించాలన్నారు. వీఏఏ పవన్‌కుమార్, రైతులు పసుపులేటి లక్ష్మణరావు, జలందరరావు, అచ్యుతరావు, సత్యనారాయణ, జగదీశ్, నాగేశ్వరరావు, భాస్కరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఆర్బీకేల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయాలి

**కె.కోటపాడు :** జీడి పిక్కలను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు డిమాండ్ చేశారు. జీడి రైతుల సమస్యలను వివరిస్తూ కింతాడ పంచాయతీ కార్యదర్శి అనురాధకు మంగళవారం ఆయన వినతిపత్రం అందించారు. జీడి రైతులు పండించిన 80 కిలోల జీడిపిక్కల బస్తాకు ప్రభుత్వం రూ.10 వేల మద్దతు ధరను అందించాలని కోరారు. జీడి పంట విస్తరణకు గతంలో ఇచ్చిన రాయితీని ప్రభుత్వం మరలా కల్పించాలని, జీడి పిక్కలు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్‌లను పంట ఎక్కువగా పండే ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నాయినిబాబు కోరారు. జీడిపిక్కలను ఆరబెట్టేందుకు టార్పాలిన్‌లు ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు పాల్గొన్నారు.

## ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో వాటర్ ట్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

**చీడికాడ :** మండలంలోని కోనాం శివారు కొండ్లకొత్తూరులో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామస్తులతో కలసి వాటర్ ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గతంలో చినకోనాం నుంచి గ్రామానికి నీరు సరఫరా చేసేవారని, కానీ ఆరు మాసాల క్రితం కొత్త వాటర్ ట్యాంకు పేరిట అక్కడ నుంచి నీటి సరఫరా నిలిపివేసారని, దీంతో గ్రామంలోని ఒకే ఒక బోరుపైనే జనం ఆధారపడ్డారు. ఇటీవల దానికి వాటర్ ట్యాంకుకు సంబంధించి మోటార్ బిగించడంతో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. వెంటనే తాగునీరు అందించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు తదితరులున్నారు.

### రెవెన్యూ సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

**దేవరాపల్లి:** రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపాలని అనకాపల్లి ఆర్డీవో ఎస్. ఆయిషా ఆదేశించారు. ఇటీవల జరిగన బదిలీల్లో భాగంగా అనకాపల్లి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయేషా తొలిసారిగా దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ కె.అప్పారావు, మండల సర్వేయర్ గోవిందరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సతీష్‌తో మండలంలోని రెవెన్యూ పరమైన సమస్యలపై చర్చించారు. వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**పరవాడ:** యలమంచిలి–గాజువాక రహదారిలో జాజులవానిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. అచ్యుతాపురం మండలం తమ్మయ్యపేటకు చెందిన ముచ్చు చిన్నారావు మంగళవారం తన భార్య, పిల్లలతో కలిసి పండగ దుస్తులు కొనేందుకు బైక్‌పై గాజువాక వెళుతున్నాడు. గాజువాక నుంచి పరవాడ వైపు వస్తున్న బొలెరో వ్యాన్ చిన్నారావు బైక్‌ను ఢీ కొంది. బైక్‌పైనున్న చిన్నారావు, భార్య హేమలత, కుమారుడు సాకేత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు దర్యాప్తు చేస్తున్నారు.